చిన్న 'జీపీ'లకు పెద్ద కష్టం


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు (ఫైల్)

- నిధులు లేక లోపించిన పారిశుద్ధ్యం
- ప్రత్యేకాధికారులు ఉన్నా.. లేనట్లే!

వనపర్తి రూరల్: సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి ఏడాదిన్నర అయినా తిరిగి ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం పడకేసింది. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం నాలుగైదు గ్రామాలకు ఒక ప్రత్యేకాధికారిని నియమించినా.. పనిభారం పెరగడంతో వారు గ్రామాలకు మళ్లిచూడట్లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉత్పన్నం అయితే వాటిని ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీలు వసూలు అయిన పన్నులతో ఎలాగోలా నెట్టుకొచ్చినా చిన్న గ్రామ పంచాయతీలు, తండాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కనీస అవసరాలైన వీధి లైట్లు, పారిశుద్ధ్యం కూడా కొనసాగించలేని పరిస్థితులు దాపరించాయి.

చెత్త రిక్షాలే దిక్కు!

మండలంలో 26 గ్రామ పంచాతీయలు ఉండగా వాటిలో 9 గిరిజన తండాలు ఉన్నాయి. వీటిలో నిధుల కొరతతో పలు అభివృద్ధి కార్యక్రమాల భారం అంతా కార్యదర్శులపైనే పడుతుండటంతో.. అప్పులు చేసి గ్రామ పంచాయతీలను నెట్టుకొస్తున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరణలో రోజువారీగా ట్రాక్టర్లకు డీజిల్ పోయించలేక ఎక్కడపడితే అక్కడే ఆగిపోతున్నాయని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తప్పని దీనితో గతంలో జీపీలకు కేటాయించిన చెత్త రిక్షాలను మరమ్మతు చేయించి చెత్త సేకరించాల్సిన దుస్థితి ఏర్పడింది.


కడుకుంట్లలో రిక్షాతో చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు

జీపీలకు ఎన్నికలు జరగకపోవడంతో ఏడాది నుంచి కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం లేదు. దీంతో పల్లెల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ప్రభుత్వ పథకాల సర్వే, ట్రాక్టర్, ట్యాంకర్ల నిర్వహణ, పైపులైన్ల లీకేజీలు, వీధి దీపాలు, ట్రాక్టర్ వాయిదాలు చెల్లించేందుకు కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. నిధుల కొరతతో పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకలేక వారితో పనిచేయించడం కష్టతరంగా మారింది. చిన్న పంచాయతీలకు కనీసం నెలకు రూ.15 నుంచి రూ.20 వేలు, పెద్ద పంచాయతీలో నెలకు రూ.60 నుంచి రూ.80 వేలు వరకు ఖర్చు అవుతుంది.

వచ్చేది ఎండాకాలం..

ఎండాకాలంలో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉండడంతో స్థానికంగా నీటి అవసరాలు తీర్చుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. గ్రామ పంచాయతీ పరిధిలోని బోర్ల మోటార్లకు మరమ్మతులు చేయించడం, ట్యాంకర్ల నిర్వహణ, పైప్‌లైన్ లీకేజీలను సరి చేయడం వంటి అదనపు భారం పంచాయతీలపై పడే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి స్థానిక అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

మోయలేని భారం



జిల్లాలోని గ్రామ పంచాయతీల నిర్వహణ కారణంగా కార్యదర్శులు అప్పుల పాలవుతున్నారు. నిధులు లేక నిర్వహణ భారంతో విధులు సక్రమంగా నిర్వహించలేక పోతున్నామని కలెక్టర్, డీపీఓ, ఎంపీడీలకు వినతిపత్రాలు అందజేశాం. మార్చి 1 నుంచి పంచాయతీల్లో ఆర్థికపరమైన లావాదేవీలు జరపమని అధికారులకు వివరించామన్నారు. నిధులు విడుదల చేసి గ్రామ పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శులపై తగ్గించాలి.

– మహేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శుల సంఘం

నిధుల కొరత

సర్పంచ్‌ల పాలక వర్గం ముగిసినప్పటి నుంచి నిధులు రావడం లేదు. కార్యదర్శులకు గ్రామ పంచాయతీ నిర్వహణ ఒక సవాలుగా మారిన విషయం వాస్తవమే. విషయాన్ని డీపీఓ దృష్టికి తీసుకెళ్లాం. నిధులు వచ్చిన వెంటనే విడుదల చేయిస్తాం.

– రాఘవ, ఎంపీడీఓ

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులు, నర్సరీని బుధవారం ఎంపీడీఓ గోవింద్‌రావు, ఏపీఓ కుర్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పనులను నిబంధనల మేరకు చేపట్టాలని, పనుల వద్ద కూలీలకు ఇబ్బందులు కలుగకుండా నీడ, తాగు నీరు వంటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. నర్సరీల్లో మొక్కలు ఎండకుండా క్రమం తప్పకుండా నీటిని పట్టాలన్నారు.

డంపింగ్‌యార్డు తొలగించండి



ఆత్మకూర్: పట్టణంలో నివాసాల మధ్య డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనిఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును వెంటనే తొగించాలని బుధవారం తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. దుర్వాసన భరించలేకున్నామని, చెత్తను నిత్యం తగులబెడుతుండడంతో పొగతో శ్వాసకోశ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇంద్రానగర్ కాలనీవాసులు వాపోయారు. కార్యక్రమంలో దండు శ్రీనివాసులు, మాసన్న, సోంబాబు, జహంగీర్, జానకీరాములు, రాము, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గోపాల్‌పేట: అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని గంగారం గ్రామానికి చెందిన నరసింహ గోపాల్‌పేట మండలంలోని చెన్నూరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున పట్టుకుని ట్రాక్టర్ సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఇసుక తరలించాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ఖిల్లాఘనపురం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఇద్దరికి జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడు బుధవారం తెలిపారు. ఇటీవల మండలంలోని గట్టుకాడిపల్లికి చెందిన బాలస్వామి, కర్వెన గ్రామానికి చెందిన చింతకాలయల రాజు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా.. పోలీసులు చేసిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో దొరికారు. వారిపై కేసు నమోదు చేసి వనపర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి నాలుగు రోజుల పాటు జైలుశిక్ష విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు సురక్షితం

మదనాపురం: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు సాధ్యమవుతాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భవానీ అన్నారు. బుధవారం ప్రసవాల కోసం కోసం పీహెచ్‌సీకి వచ్చిన నలుగురు గర్భిణులకు ఆమె వైద్య సేవలు అందించి, సాధారణ కాన్పులు చేయించారు. వీరిలో ముగ్గురు ఆడపిల్లలు కాగా ఒక్క మగ పిల్లవాడు జన్మించారని, తల్లీబిడ్డలందరూ ఆరోగ్యంగా ఉన్నారన్నారు.

తాగు, సాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

వనపర్తి రూరల్: వేసవిలో గ్రామాల్లో తాగు, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా నాయకుడు శ్రీరామ్, పట్టణ కార్యదర్శి జి రమేష్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేతేపల్లిలో భీమా–24 కాల్వకు నీరు రాక పాన్‌గల్, వీపనగండ్ల మండలాలల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్ చివరి వరకు సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో పలు గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి మొదలైందని, కేతేపల్లి భగత్‌సింగ్‌నగర్, గోకరపాయమిట్ట ప్రాంతాలకు భగీరథ నీళ్లు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు తాగునీరు, నీడ, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లక్ష్మీనారయణ, కాకం చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి వారిని వ్యాధుల బారి నుంచి కాపాడాలని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి సబ్‌సెంటర్‌ను సందర్శించి వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణుల నమోదు వివరాలను పరిశీలించారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి అంటువ్యాధుల నుంచి రక్షణ పొందుతారన్నారు. గర్భిణులకు మొదటి, రెండో డోస్ టీటీ వ్యాక్సిన్ వేయించాలని సిబ్బందికి సూచించారు.

పీహెచ్‌సీలోనే మెరుగైన వైద్యం

పీహెచ్‌సీలోనే మెరుగైన వైద్యం అందుతుందని ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకోవాలని ఏఎన్‌ఎం సుమిత్ర అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దులలో గర్భిణి రాజేశ్వరికి అవగాహన కల్పించి అంబులెన్స్‌లో ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించుకోవడంతో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందుతాయన్నారు.


గర్భిణిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వనపర్తి టౌన్: నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సంబంధించిన 11 మంది లబ్ధిదారులకు రూ.2.30లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పేదలకు వరంలాంటిదన్నారు. గతంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల కోసం నాయకుల ఇళ్ల చుట్టూ బాధితులు తిరిగేవారని, పార్టీలకు అతీతంగా ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నారాయణ, పెంటన్నయాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, రాగి వేణు, జానంపేట నాగరాజు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులతో డాక్టర్ జి.చిన్నారెడ్డి

ఉద్యోగ విరమణ తప్పనిసరి

గోపాల్‌పేట: విద్యార్థికి ఏమీ తెలియని సందర్భం నుంచి ఉన్నత స్థితికి చేరుకునేందుకు ఉపాధ్యాయుడి కృషి ఎంతో ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఏదుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన దామోదర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్నారెడ్డి ఉపాధ్యాయుడిని సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు సహదేవ్, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీ

కొత్తకోట రూరల్: రాష్ట్రప్రభుత్వం అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి మార్చి 31లోపు కల్పించిన 25శాతం రాయితీకి ప్రజల నుంచి స్పందన మొదలైందని కొత్తకోట కమిషనర్ సైదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలో 11మంది ఎల్ఆర్ఎస్ ఫీజు రూ.1,58,918 చెల్లించారని, మార్చి 31 వరకు మాత్రమే గల 25శాతం రాయితీని మిగిలిన దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడే విద్యనేర్పిన ఉపాధ్యాయులు, కని పెంచిన తల్లిదండ్రులకు సంతోషం కలుగుతుందని ఖిల్లాఘనపురం బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మునావర్ సుల్తానా అన్నారు. బుధవారం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి అనుభవాలు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో చదువుకుని వెళ్తున్న విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి.

చోరీ జరిగిన ఇంటిని పరిశీలించిన ఎస్పీ


కుటుంబ సభ్యుల నుంచి వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ రావుల గిరిధర్

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామాన్ని బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పరిశీలించారు. గ్రామంలో బేగిని ఆంజనేయులు ఇంట్లో తాళాలు ధ్వంసం చేసి రూ.1.20 లక్షల నగదు, పది తులాల వెండి గొలుసులు చోరీ చేసిన విషయాన్ని పరిశీలించేందుకు ఎస్పీ గ్రామాన్ని సందర్శించారు. ఇంటి పరిసరాలు, ధ్వంసం అయిన తాళం, తలుపులు, బీరువాలను ఎస్పీ పరిశీలించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరించారు. ఆయన వెంట సీఐ కృష్ణ, ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో..

మాందాపూర్‌లోని బేగిని ఆంజనేయులు ఇంటిని డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ కృష్ణ పరిశీలించి, ఘటన వివరాలపై ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించి దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే చోరీలు జరిగిన సమయంలో నిందితులను త్వరగా గుర్తించే వీలు కలుగుతుందన్నారు. వారి వెంట స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సైన్స్‌తో మేధాశక్తి పెంపొందుతుంది'

అమరచింత: సైన్స్‌ఫేర్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మేదస్సు పెరుగుతుందని మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్ అన్నారు. సైన్స్‌డే ను పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఆయా తరగతుల విద్యార్థులు పలు రకాల బోధన పరికరాలను తయారు చేసి, వాటి గురించి తల్లిదండ్రులతో పాటు తోటి విద్యార్థులకు వివరించారు. సైన్స్‌ఫేర్ తిలకించడానికి పట్టణంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులు తయారు చేసిన పరికరాల గురించి తెలుసుకుంటున్న ఎంఈఓ భాస్కర్‌సింగ్

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


పాన్‌గల్‌లో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్ యుగంధర్ మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలు చేరుకుంటారన్నారు. కొత్తకోట మండలంలోని కనిమెట్ట, రాణిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో, అమడబాకుల జిల్లా పరిషత్, పాన్‌గల్ ప్రాథమిక, రేమద్దుల ఉన్నత పాఠశాలలో, మదనాపురం మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో, ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలతో పాటు అప్పారెడ్డిపల్లి, వీపనగండ్ల మండలంలోని కల్వరాల ప్రాథమిక పాఠశాలలో, తూంకుంట, ఆత్మకూర్ మండలంలోని జూరాల ఉన్నత పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పలత, రాఘవేందర్, శ్రీనివాసులు, కాళీదాస్, సురేష్‌బాబు, ఉపాధ్యాయులు వరలక్ష్మి, మాధవి, నరేష్, లక్ష్మీదేవి, జమునారాణి, వెంకటయ్య, కొండ రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాధిక, ధనుంజయ్‌గౌడ్, సుచరిత, మానస, షకీల్‌అహ్మద్, లాయఖ్‌ఫాతీమా, రవిప్రకాష్, రేణుక, నరేష్, రోజా, ఉమాదేవి, గీత ఉన్నారు.

రికార్డులు మాయం అంటూ హంగామా

- బాలుడిపై పోలీసులకు ఫిర్యాదు

గోపాలపేట: అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు మాయమైనట్లు ఓ అంగన్ వాడీ టీచర్ హంగామా చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనేపథ్యంలో ఓ బాలుడు రికార్డులు మాయం చేశాడని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్‌ఐ చేయిచేసుకున్నట్లు బాధితుడి తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది. కాగా ఆ రికార్డులు గంట లోపే లభించాయి. బాధిత కుటుంబం, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గోపాల్‌పేట మండలంలోని పాటిగడ్డతండాకు చెందిన ఓ వ్యక్తి అక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో అవకతవకలు జరిగాయని అంగన్‌వాడీ టీచర్‌పై ఫిర్యాదు చేస్తూ 2019 నుంచి 2024 వరకు పూర్తి వివరాలు కావాలని సమాచార హక్కు చట్టం ద్వారా ఫిబ్రవరి నెలలో జిల్లా కేంద్రంలో ఫిర్యాదు చేశాడు. ఇందులో భాగంగా సీడీపీఓ విచారణ చేయగా కొన్ని రికార్డులు కనిపించలేదు. అంగన్‌వాడీ కేంద్రం బయట రిజిస్టర్లు ఉండగా బాలుడు(16) తీసుకెళ్లాడని ఓ యువకుడు అంగన్‌వాడీ టీచర్‌కు చెప్పాడు. దీంతో బుధవారం ఉదయం అంగన్‌వాడీ టీచర్‌కు చెందిన వారు గోపాల్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఆ బాలుడిని పిలిపించి కొట్టాడని అతడి తల్లి, బంధువులు ఆరోపించారు. ఇదే విషయమై ఎస్‌ఐ నరేష్‌కుమార్‌ను వివరణ కోరగా తాను ఎవరినీ కొట్టలేదని, వాళ్ల రాజకీయ కక్షలు పెట్టుకొని తనను బదనాం చేస్తున్నట్లు తెలిపారు. బాలుడిని పిలిచి విచారించానని గంట లోపే రిజిష్టర్లు ఉన్నాయని తెలియడంతో పంపించినట్లు సమాధానమిచ్చారు.

సీసీ వేశారు.. మట్టి మరిచారు

అమరచింత: పట్టణంలోని జములేశ్వరి ఆలయం వరకు రూ.5 లక్షలతో నూతనంగా సీసీ రోడ్డును నిర్మించినా.. ఇరువైపులా మట్టిని వేయడం మరిచారు. కచ్చరహదారిపై సీసీ వేయడంతో రోడ్డుకు ఇరువైపులా ఆరు ఇంచుల మేరకు ఎత్తు ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనదారులు వాటిని తప్పించబోయి కిందపడుతున్న పరిస్థితులు దాపరించాయి. సీసీ రహదారి నిర్మాణ పనులు పూర్తైనేటికి ఐదు నెలల గడుస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ రహదారులకు ఇరువైపుల మట్టిని వేయక పోయినా అధికారులు మాత్రం బిల్లులు ఇవ్వడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయించాలని కోరుతున్నారు.


జములమ్మ ఆలయానికి వేసిన సీసీ రహదారి

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు

సాక్షి, నెట్‌వర్క్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఐదు నిమిషాల నిబంధన తీసుకురావడంతో విద్యార్థులకు ఊరట లభించింది. గతంలో నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో చాలా మంది విద్యార్థులు పరీక్ష రాయకుండానే నిరాశతో వెనుదిరిగేవారు. పరీక్ష కేంద్రంలో అధికారులు విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కొత్తగా సీసీ కెమెరాలతో ఉన్నతాధికారులు నిత్యం కేంద్రాలపై నిఘా ఉంచనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులోకి తెచ్చారు.

- కొత్తకోట పట్టణంలోని నివేదిత జూనియర్ కళాశాలలో 337మంది విద్యార్థులకు గాను 326మంది, ప్రతిభ జూనియర్ కళాశాలలో 281మంది విద్యార్థులకు గానూ 271మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 213మంది విద్యార్థులకు గానూ 202మంది విద్యార్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను సూపరింటెండెంట్లు గోపాల్, కృష్ణకుమారి, రాజు నిరంతరం పర్యవేక్షించారు. పోలీస్‌స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కాట్‌తో తీసుకొచ్చినట్లు కస్టోడియల్ అధికారి విశ్వేశ్వర్ తెలిపారు.
- పాన్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 92 మంది విద్యార్థులకు గాను 90 మంది పరీక్ష రాయగా.. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సుదర్శన్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు సందర్శించి విద్యార్థుల వివరాలు, ఏర్పాటు చేసిన వసతులపై అధికారులతో ఆరా తీశారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ శ్రీనివాసులు బందోబస్తే ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- గోపాల్‌పేట మండల కేంద్రంలోని కేంద్రంలో 179 మంది విద్యార్థులకు 172 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సు జీఎఫ్‌సీ కోర్సులో 39 మంది విద్యార్థులకు గాను 38 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.
- ఖిల్లాఘనపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 170 మంది విద్యార్థులకు గాను 168 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రామచంద్రప్ప తెలిపారు.
- ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 373 మందికి గాను 11 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. వికాస్ కళాశాలలో 167 మందికి గాను 9 మంది పరీక్షకు హాజరు కాలేదని సూపర్‌వైజర్లు భాగ్యవర్ధన్‌రెడ్డి, మహేందర్, శాంతిరెడ్డి, రాము తెలిపారు.
- వీపనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 72 మంది విద్యార్థులకు గాను 69 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు.


ఖిల్లాఘనపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు


వనపర్తిలో..


వీపనగండ్లలో..


పాన్‌గల్‌లో..

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ తదితరులు

ఖిల్లాఘనపురం: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ సుగుణ అన్నారు. బుధవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు కాల్ చేసి సమాచారం చెప్పాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కౌన్సిలర్ రాజేష్‌కుమార్, బాలల పరిరక్షణ విభాగం సభ్యులు నరేష్, అధికారి కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.